తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# హోలీపండుగ రోజు విషాదం

- శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థి దుర్మరణం
- రంగులు తీసుకెళుతూ లారీ చక్రాల కింద నలిగిన ప్రాణం

తడ, మార్చి 14 ప్రభాతవార్త: హోలీ పండుగ సంబరాలు చేసుకోవడానికి సిద్ధమైన శ్రీసిటీ ట్రిపుల్ ఐటీలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం ట్రిపుల్ ఐటీలో సెకండియర్ చదువుతున్న ఎంఆర్ ప్రత్యూష్ (21) రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. కాలేజికి చెందిన స్కూటీలో రంగులు కొనుగోలు చేయడానికి సూళ్లూరుపేట పట్టణానికి వెళ్లి తిరిగి వస్తుండగా తడ మండలం కొండూరు వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రత్యూష్ మృతిచెందాడు. నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి స్కూటీని వెనుక నుంచి ఢీకొనడంతో లారీ చక్రాలు ఈ విద్యార్థిపై నుంచి వెళ్లి అక్కడికక్కడే చనిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. శ్రీసిటీ ట్రిపుల్ ఐటి కాలేజికి చెందిన ఉమాశంకర్ సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యూష్ కర్ణాటక రాష్ట్రం మైసూరు సమీపంలోని మాండ్యా ప్రాంతానికి చెందిన వానిగా అతని తండ్రి రాజశేఖర్‌గా గుర్తించారు.



తడ మండలం కొండూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

ట్రిపుల్ ఐటీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరు పేట ప్రభుత్వాసుపత్రికి శవాన్ని తరలించారు. ఎస్ఐ కొండప్ప నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హోలీ పండుగ రోజు శ్రీసిటీలోను, తడ, సూళ్లూరుపేటలోను విషాదం అలముకుంది. సాయంత్రం దాకా కుటుంబ సభ్యులు ఇక్కడికి చేరుకోలేదని తెలిసింది.

# నామినేటెడ్‌కు చిగురిస్తున్న ఆశలు !

-కష్టపడినివారికే పదవులంటున్న అధినేత మాటతో ఆనందం -మాజీల,సీనియర్ల ఆశలన్నీ పదవుల పైనే

ప్రభాతవార్త-తిరుపతి:



ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. పలువురు మాజీ ఎంఎల్ఎలు, సీనియర్ నేతలు ఇప్పుడు మలివిడత పదవులు దక్కించు కునేందుకు తమతమ స్థాయిలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నిన్నటి వరకు సిఎం సొంత జిల్లాలో తిరుపతికి చెందిన మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఎ ఎస్‌సివి నాయుడులలో ఎవరికైనా ఎంఎల్‌సి పదవి వస్తుందని ఆశ పడ్డారు. ఇందుకోసం శక్తివంచనలేకుండా కృషి చేశారు. అధినాయకత్వం కళ్లలో పడటానికి మరింతగా శ్రమించారు. కానీ అనూహ్యంగా రాయలసీమ జిల్లాల్లో ఆ పదవిని ఎవరినీ వరించలేదు. దీంతో డీలాపడిన ఆశావహులకు ఇప్పుడు నామినేటెడ్ పదవులే శరణ్యంగా మారాయి. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తిరుపతి ,చిత్తూరు నియోజకవర్గాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇక్కడ టిడిపి శ్రేణులు కూడా బలంగా ఉన్నాయి. ఎందరో సీనియర్ నేతలు కూడా పార్టీ కష్టకాలంలోనూ ప్రాణాలకు తృజించి పోరాడారు. తిరుపతి లో సుగుణమ్మ, సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, పుష్పావతి యాదవ్, బిజి కృష్ణయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, కంకణాల రజినీకాంత్‌నాయుడు ఇలా పలువురు నేతలు ఎన్నికల సమయంలోనూ గట్టిగా పోరాటం చేశారు. సిఎం సొంత జిల్లాలో మొదటి విడత, రెండవ విడత నామినేటెడ్ పదవులు కేటాయించినా సీనియర్లకు దక్కలేదు. కుప్పం, చిత్తూరు, చంద్రగిరి నియోజక వర్గాల్లో నలుగురు నేతలకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టారు. ఇప్పుడు సీనియర్లు, పార్టీకోసం కష్టపడిన నేతలకు పదవులు ఇస్తానని స్వయంగా చంద్రబాబే ప్రకటించారు. ఈ నేపథ్యంలో కూటమి పార్టీలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు ఆయా పార్టీలకు విధేయులుగా ఉన్నవారికి పదువులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం కష్టపడే నాయకులకు ఏదో ఒకపదవి ,కార్పొరేషన్, మార్కెట్ కమిటీ, తుడ, గ్రంధాలయ సంస్థ డైరెక్టర్, తుడ డైరెక్టర్ పదవులు ,ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు, ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పలు దేవాలయాల పాలకవర్గాల్లో చోటు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో చోటు కల్పించాలనేది నేతలు ఆశలు. ఇప్పటికే పార్టీకోసం శ్రమించిన వారి వివరాలు పంపాలని కూడా సిఎం జిల్లాలోని నేతలకు ఆదేశించారు. సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమించేందుకు అధినేత సిద్ధంగా ఉన్నారనేది నాయకుల్లో గట్టి విశ్వాసం. తిరుపతిలో పలు దేవాలయాలకు కూడా పాలకవర్గాలు ఏర్పాటుచేయాల్సి ఉంది. నామినేటెడ్ పదవులు రెండేళ్ళ పదవీకాలం కావడంతో చాలా వరకు తెలుగుతమ్ముళ్ళు ఆశల్లో విహరిస్తున్నారు. గ్రూపు రాజకీయాలకు అవకాశం లేకుండా కార్యకర్తలను కలుపుకుని ముందుకు వెళ్ళాలని ఇప్పటికే బాబు నిర్దేశం చేయడం విశేషం. మరీ ఈనెలాఖరులోపు నామినేటెడ్ పదవులు ఉగాది పండుగ వేళ బహుమానంగా అందిస్తారనేది కూటమి పార్టీల నేతల్లో సదభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఇ-క్రాప్ నమోదులో జాప్యంతో... నష్టపోతున్న అన్నదాతలు

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాలు ధాన్యాగారాలుగా ఉన్నాయి. రైతులు పంటలు వేసినపుడు పంట కోత దశలో ఉన్నపుడు ఆకాశాన్ని చూసే ధరలు పంట చేతికొచ్చే సమయంలో పాతాళా నికి పడిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర కల్పించాలంటే ఇ క్రాప్ నమోదు తప్పని సరి. అయితే రాష్ట్రంలోని తిరుపతి,నెల్లూరు జిల్లాలు తప్ప మిగిలిన రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నైరుతి రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. అక్కడ పంటలు ఆగస్టు సెప్టెంబర్ మాసంలో వేస్తారు. దాంతో ప్రభుత్వం జారి చేసిన ఇ క్రాప్ యాప్‌లో రైతులు వేసిన పంటలు నమోదు అవుతాయి. అయితే ఈశాన్య రుతు పవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. పంటలు వేయటం నవం బర్, డిసెం బర్‌లో వేయాలి, కానీ రుతుపవనాల్లో మార్పు వల్ల జనవరి చివరి వరకు పంటలు వేస్తున్నారు. దాంతో 'ఇ-క్రాప్‌లో' నమోదు కావటం ఆలస్యం కావటంతో రైతులకు ప్రభుత్వం అందించే మద్దతు ధర లభించటం లేదు. ప్రభుత్వం రెండు జిల్లాలకు సంబంధించి ఇ క్రాప్ నమోదుకు ప్రత్యేక తేదులు ఖరారు చేయాలి.వరి ధాన్యాల సేకరణకు రైతు సేవా కేంద్రాల ద్వారా, మార్కెటింగ్ కమిటీల ద్వారా అవకాశం కల్పించాల్సి ఉంది.



ధాన్యం రాసులు

**రైతుల అవగాహన లేక..**

ఈ ప్రాంతాల్లో రైతులకు ఇ క్రాప్‌కు సంబంధించి అవగాహన లేకపోవడం తో నమోదు జరగటం లేదు. రైతులు ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలను పొందాలంటే రైతులకు అవగాహన ఎంతో అవసరం. ఈ ప్రాంతా ల్లో కొన్ని ప్రాంతాల్లో వరి పంట చేతికొచ్చింది. మరి కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ఒబ్బిడి జరగ లేదు. ఇక ఇ క్రాప్ 40శాతం కూడా జరగలేదని తెలిసింది.గతంలో తెలంగాణ రాష్ట్రంలో పంటల్లేక పోవటంతో ఆంధ్ర రాష్ట్రంలో సేకరించారు. దాంతో ఆ సమయంలో బస్తాకు రూ.2300లు (టన్ను) పలికింది. ప్రస్తుతం తెలంగాణకు సరఫరాపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దాంతో ఇక్కడ పంట దళారుల పాలు కాకతప్పటం లేదు. ఈ ప్రాంతాల్లో ప్రతి ఏటా సుమారు 10 నుంచి 12లక్షల టన్నుల వరి ఉత్పత్తి అవుతుంది. కానీ ఇ -క్రాప్ నమోదులో ఇప్పటి వరకు కనీసం 20 నుంచి 30శాతం కకూడా నమోదు కాలేదు. దాంతో రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రశ్నార్థకంగా మారింది.

**పొలాల్లోనే రైతుల పంటలు అమ్మకాలు:**

ఈ ఏడాది కూడా రైతులు తాము పండించిన పంటలను దళారులకు ధార బోస్తున్నారు. దళారులు 80కిలోల బస్తా ప్రస్తుతం రూ.1500లకు కొను గోలు చేస్తున్నారు. అదే ప్రభుత్వం సేకరించి ఉంటే 75కిలోల బస్తా రూ. 1720 దక్కెది. అయితే ప్రభుత్వానికి ధాన్యం అందించాలంటే బాగా ఎండ బెట్టాలి. చక్కబెట్టాలి. అయితే వాతావరణం దృష్ట్యా రైతులు చేయలేక పోతున్నారు.అయితే ప్రభుత్వాలు కల్పించిన వసతుల సాధనలో సవాలక్ష నిబంధనలుండటంతో వాటిని సంతృప్తి పరచలేని రైతులు రేయింబవళ్ళు కష్టించి పండించిన పంటను దళారులకు ధారబోసుకుంటున్నారు.

**రైతులకు నష్టమేమీ లేదు:**

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించి వ్యవసాయశాఖ ఎడిఏ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా ఇ క్రాప్ చేస్తున్నామని ఇంకా పంట కొన్ని ప్రాంతాల్లో చేతికి రాలేదని తెలిపారు.అయితే రైతులకు దళారుల వల్ల కూడా నష్టం లేదంటున్నారు. బయటి మార్కెట్ ధరకు ప్రభుత్వ మద్దతు ధరలకు దాదాపు సమానంగానే ఉందన్నారు.జనవరిలో చేతికొచ్చిన పంటల రైతులు కొంత వరకు నష్టపోయిన మాట వాస్తవమే అన్నారు.రైతుల రైతే సేవా కేంద్రాల వద్దకు వెళ్ళితే ఇ క్రాప్ నమోదు చేస్తున్నారని రైతులు అవగాహనతో ముందడుగు వేయాలని సూచించారు.

# శ్రీ సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవరకు పోటెత్తిన భక్తులు

- జారతకు విచ్చేసిన నారా భువనమ్మ.. రాష్ట్ర మంత్రి సవిత ! -జనసంద్రంగా కదిరిముత్తనపల్లి .. స్వామివార్లకు ప్రత్యేక పూజలు
- భక్తుల తలలపై పగిలిన టెంకాయలు !!

శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త : తొమ్మిదేళ్ల అనంతరం కురబకులస్తులు జరుపుకున్న శ్రీసిద్ధేశ్వం స్వామి పెద్ద దేవరకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. ఈ దేవరను తిలకించేందుకు సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత హాజర య్యారు. మండలంలోని కదిరిముత్తనపల్లి గ్రామం లో గత నాలుగు రోజులుగా జరిగిన పెద్ద దేవర కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం దేవరలో కీలక ఘట్టాన్ని నిర్వహించారు. స్వామివార్లను దర్శించు కునేందుకు భక్తజనం బారులు తీరి కన్పించారు. సాయంత్రం మొక్కులు కలిగిన భక్తుల తలలపై టెంకాయలు పగలగొట్టే కార్యక్రమాన్ని ఘన ంగా నిర్వహించారు. తొలుత దేవర ఎద్దులపై టెంకాయలు పగలగొట్టారు. కాగా రాత్రి బాగా పొద్దుపొయ్యే దాక కూడా కదిరిముత్తనపల్లి గ్రామంలో జాతర సందడి నెలకొంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళ నాడు రాష్ట్రాలనుంచి ఉదయం నుంచే లక్షలాది మంది జనం కదిరిముత్తనపల్లి వైపుకు చేరుకున్నారు. స్వామివార్ల దర్శనానికి విచ్చేసిన ప్రముఖులను ఆలయ ధర్మకర్త మునిరత్నం గౌడు సాదర ంగా ఆహ్వానించారు. రాత్రి ఆలయం వద్ద దీపారాధన, భక్తుల కాలక్షేపం కోసం పండరి భజన, పుష్పపల్లకి ఊరేగింపు, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. కాగా జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు చేపట్టారు.





స్వామిని దర్శించుకున్న నారా భువన్వేరి, భక్తుల తలలపై టెంకాయలు పగలగొడుతున్న దృశ్యం

# గరుడగమనరారా... మము కరుణ ఏలుకోరా!

తిరుమల,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వర స్వామి ఉత్స వమూర్తి మలయప్పస్వామి పాల్గుణ పౌర్ణమి వేళ శుక్రవారం రాత్రి విశేషాభరణాల అలంకృతుడై ఆలయ మాఢవీధుల్లో గరుడునిపై విహరించారు. గరుడసేవకు విశిష్టప్రాధాన్యత ఉంది. పౌర్ణమి ఘడియల్లో రాత్రి 7గంటలకు వాహన మండపం నుండి మొదలైన గరుడసేవ చల్లటిగాలుల మధ్య మలయప్ప స్వామి తనకిష్టమెన గరుడునిపై విహరిస్తూ భక్తజనానికి దర్శనమిచ్చాడు. భక్తులు కర్పూరహారతులిచ్చి స్వామిని సేవించారు. ఈ సేవలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాధం, ఆలయ పేష్కార్ రామకృష్ణ,ఆలయ ఏవిఎస్ఓ రాజశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.



# హామీ నెరవేర్చిన శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ యాజమాన్యం




రేణిగుంట, మార్చి 14 ప్రభాతవార్త : ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ యాజమాన్యాన్ని పలువురు అభినందిస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం బాలాజీ మెడికల్ కాలేజీ అనుబంధ మెడికల్ షాపులో మందుల ధరలు అధికంగా ఉన్నాయని పలువురు విలేకరులు సీఈవో పాణిగ్రాహి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన పాణిగ్రాహి మెడికల్ షాప్ నిర్వాహకులను పిలిచి వివరణ అడిగారు. మందులు సరఫరా చేసే కంపెనీలతో సంప్రదిం చారు. వెంటనే మెడికల్ షాపులో విలువైన మందులకు 40 శాతం, సాధారణ మందులకు 10 నుండి 20 శాతం డిస్కౌంట్ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అంతేకాకుండా మెడికల్ షాప్ ముందు పెద్ద బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆయన ఆదేశాల మేరకు మెడికల్ షాప్ నిర్వాహకులు డిస్కౌంట్ సంబంధించిన సూచిక బోర్డును ఏర్పాటు చేయడమే కాక డిస్కౌంట్ కూడా ఇస్తున్నట్లు పలువురు మందులు కొన్న వారు తెలిపారు. ఇదిలా ఉండగా రేణిగుంట నుండి బాలాజీ ఆసుపత్రికి దూరం ఎక్కువ కావడంతో ఇచ్చిన మాట ప్రకారం సీఈవో పాణిగ్రాహి రోగులను తీసుకురావడానికి తీసుకు వెళ్ళడానికి ఉచిత బస్సును ఏర్పాటు చేసి అందరి మన్ననలను పొందుతున్నారు.

# పంట పొలాలపై... పంజా విసిరిన గజరాజు

- మండలంలో 3 రోజులుగా ఓంటరి ఏనుగు హల్‌చల్ - ప్రజల్లో భయభ్రాంతులు

గుడిపాల, మార్చి 14 ప్రభాతవార్త: మండల పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో ఓ ఒంటరి ఏనుగు పంట పొలాలపై పంజా విసురుతుంది. ఏనుగుల గుంపు నుండి రెండు రోజుల క్రితం విడిపోయిన ఓ ఒంటరి ఏనుగు మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన పల్లూరు, పానాటూరు, చిత్తపార సమీప గ్రామాల్లో హల్ చల్ చేస్తూ రైతులు సాగు చేసిన పంట పొలాలను నాశనం చేస్తున్నది. ఒంటరి ఏనుగు ఎప్పుడు ఎక్కడ వుంటుంది! ఎవరిపై దాడి చేస్తుంది! ఏ రైతు పంట పొలాల్లోకి వెళ్ళి పంటను నాశనం చేస్తుంది! గ్రామాల్లో ఎక్కడికైనా వస్తే తమ పరిస్థితి ఏమిటని ఇటు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఏనుగుల గుంపు నుండి తప్పించుకుని మండలంలో తిరుగుతున్న ఒంటరి ఏనుగును మళ్ళీ అడవిలోకి పంపడానికి అటవీశాఖ అధికారులు చేసిన ప్రయత్నాలు ఏ మాత్రం ఫలితాలు ఇవ్వడం లేదు. ఈ ఒంటరి ఏనుగు గురువారం అర్ధరాత్రి పాపసముద్రం, అడవిచేను, పిళ్ళారికుప్పం, వెప్పాలుమానుచేను గ్రామాల్లోని వరి పంటను ధ్వంసం చేసి ఆ పరిసర ప్రాంతాల్లోని అరటి, మామిడి చెట్లపై నాశనం చేసి చెరువు ప్రక్కన వున్న అటవీ ప్రాంతంలో తిష్ట వేసింది. గతంలో ఓ ఒంటరి ఏనుగు మండలంలోకి ప్రవేశించి బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. ఒంటరి ఏనుగు సమాచారం అందుకున్న డివైఆర్ఓ ఆనందరెడ్డి, బీట్ ఆఫీసర్ ఢిల్లీరాణి, సిబ్బంది సంఘటనా స్థలంకు చేరుకుని ఏనుగు కదలికలను గుర్తిస్తూ అటవీ ప్రాంతానికి మరల్చడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసర గ్రామాల్లోని రైతులు రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాలు, అటవీ ప్రాంతాల వైపుకు వెళ్ళకూడదని అటవీశాఖ అధికారులు సూచించారు. పంట నష్టం జరిగిన రైతుల నుండి వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసం అయిన వరి పంట

# దేవస్థానం ఎస్‌బిఐ బ్రాంచి విలీనానికి సన్నాహాలు

20వేలకు ఖాతాదారుల్లో ఆందోళన

ఒక నాడు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారుల సౌకర్యార్థం కొత్త శాఖలను ఏర్పాటు చేస్తూ వచ్చింది. నేడు పొదుపు పేరుతో ఉన్న శాఖలను విలీనం చేసే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకుంటుంది. దీనివల్ల ఎవరికి ప్రయోజనం ఎవరికి ఇబ్బంది అనే అంశాలను పరిగణలోకి తీసుకోకుండా, పైస్థాయిలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. దాంతో ఖాతాదారుల్లో ఆందోళన చెందుతున్నారు.

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో దేవస్థానం ఎస్‌బిఐ బ్రాంచిని విలీనం చేయ టానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి దేవస్థానం ఎస్‌బిఐ బ్రాంచిని, మెయిన్ బ్రాంచిలో విలీనానికి నిర్ణయించి నట్లు సమాచారం. అయితే ఇప్పటికే వేలాది ఖాతాలతో మెయిన్ బ్రాంచి నడుస్తుంది. మళ్ళీ దేవస్థానం శాఖను విలీనం అంటే ఖాతాదారుల్లో అభద్రతా భావం చోటు చేసుకుంది. గతంలో దేవస్థానం విభాగం స్టేట్‌బ్యాంకు ఆఫ్ హైదరాబాదులో విలీనం చేసారు. ఈ శాఖలో సుమారు 20వేలకు పైగా ఖాతాలతో నడు స్తుంది.గతంలో కూడా ఈ ప్రతిపాదన పరిశీలనలోకి వచ్చింది. ఇటీవల బ్యాంకుల విలీనం ప్రక్రియలో భాగంగా స్టేట్‌బ్యాంక్ఆ ఫ్ ఇండియా హైదరాబాదులో దేవస్థానం బ్రాంచిలో విలీలనం చేసారు. ప్రస్తుతం ఈ శాఖ స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ఓ భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఖాతా లు సుమారు 20వేలకు పైగా ఉన్నాయి కానీ సిబ్బంది నలుగురైదు మంది మించి లేదు. దాంతో బ్యాంకులపై అదనపు భారంతో విలీనం జరిగినపుడు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాగా మారింది.

**పట్టణ ప్రజలకు అనుకూలంగా . . .**

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాదును కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. అయితే ఐదుగురు భవనాలను బాడుగకు ఇవ్వటానికి ముందుకు వచ్చారు. కానీ ఎవ్వరూ అర్హత సాధించలేదని తెలిసింది. గతంలో కూడా ఈ ప్రతిపాదన ఉండేది. శ్రీకాళహస్తి మెయిన్ బ్రాంచి మేనేజర్‌గా హరిప్రసాద్ పని చేసినపుడు ఆయన పాత నెల్లూరు బస్టాండు వద్ద ఉన్న మున్సిపల్ భవనాన్ని ఇవ్వాలని అప్పటి కమిషనర్ రమేష్‌బాబుకు అభ్యర్థించారు. అయితే అప్పటిలో సాధ్యం కాలేదు. సుమారు ఏడాదిగా ఈ ప్రాంతాల్లో బ్రాంచి ఏర్పాటుకు సన్నాహలు జరిగాయి. కానీ ఎందుకో అమలు జరగలేదు. ప్రస్తుతం మెయిన్ బ్రాంచిలో విలీనానికి సన్నాహలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఖాతాదారులుందరూ మెయిన్ బ్రాంచిలోకి వెళ్ళాల్సిందే. అయితే ఏప్రిల్ 15 నుంచి లావాదేవిలు ప్రారంభమౌతాయని తెలిసింది.




స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచి

**అసలే పార్కింగ్ సదుపాయం తగినంత లేదు:**

శ్రీకాళహస్తి మెయిన్ బ్రాంచిలో సుమారు 40వేల ఖాతాదారులున్నారు. అసలే చిన్న స్థలంలో నిర్వహిస్తున్న మెయిన్ బ్రాంచిలో దేవస్థానం శాఖను విలీనం చేస్తే మరో 20వేల ఖాతాలు అదనంగా అవుతాయి. ఇప్పటికే మెయిన్ బ్రాంచిలో పనిని చేస్తున్న సిబ్బందిపై పని భారం అధికంగా ఉంది.విలీనం అమలుజరిగితే అక్కడ పని చేసే సిబ్బందిపై పనిభారం ఎక్కువై వత్తిడికి గురిఅయ్యే ప్రమాదం చోటు చేసుకకుంది.ఇక ఇక్కడ సరైన పార్కింగ్ సదుపాయం లేదు.వచ్చిన ఖాతాదారులకు సకాలంలో పని చేయాలంటే ఎంత వరకు సాధ్యమన్న విషయం మేనేజ్‌మెంట్ పరిశీలించాలి. మరో బ్రాంచిను పట్టణంలోని బహాదూరుపేట కొత్త పేట ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే అందరికి అనుకూలంగా ఉంటుంది. కానీ మేనేజ్‌మెంట్ ఏకపక్ష నిర్ణయాలతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది.

# ఆ ధర్మకర్తల కమిటి అంతా బోగస్!

- కొత్త కమిటి ఏర్పాటు చేయండి
- దేవాదాయ శాఖకు బి. విలాస్ గుప్తా విజ్ఞప్తి

తిరుపతి హెల్త్, మార్చి 14 ప్రభాతవార్త: స్థానిక కొత్తవీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ధర్మకర్తల కమిటి అంతా బోగస్ అని, ఆ కమిటిని రద్దు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ గతేడాది ఆగష్టు 16న ఉత్త ర్వులు జారీ చేశారని కాశీ అన్నపూర్ణ సత్రం పూర్ణ సత్రం ప్రధాన కార్యదర్శి బి. విలాస్ గుప్తా తెలిపారు. శుక్రవారం కపిలతీర్థం మార్గం లో ఉన్న శ్రీవారి సన్నిధిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీతమ్మ భూ ముల అభివృద్ధి పేరిట జరిగిన అవకతవకలకు బాధ్యులుగా చేస్తూ దేవదాయ శాఖ రద్దు చేసిందని స్పష్టం చేశారు. అయినా ఆ కమిటి అధ్యక్షులు పామిడి సత్య నారాయణ, ప్రధాన కార్యదర్శి కొండూరు మహేష్ ట్రజరర్ ససబరం శిరిషాలు ఇంకా కొనసాగుతుండం ఆక్షేపనీయమన్నారు. వారికి కొనసాగే అర్హత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త కమిటినీ ఎన్నుకోవాలని కమిషనర్ ఆదేశి ంచినా పట్టించుకోలేదు అని అంతృప్తి వ్యక్తం చేశారు. తిరిగి వారినే ఎన్నుకుని అనుమతి కోసం దేవదాయశాఖకు పంపడం ఇందులో కొసమెరుపు అన్నారు. కాని దేవదాయశాఖ పరిగణలోకి తీసుకోలేదన్నారు. అలాగే పంగుళూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం అభివృద్ధి బాధ్యతలను తాత్కా లికంగా పసుపర్తి గోపినాథ్, టీజీ వెంకటేష్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్నిచ్చి ఏడు నెలలు గడుస్తున్నా అమ్మవారి ఆభర ణాలు, ఇతర గణాంకాల వివరాలు బాధ్యతలను ఆయన ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నారని ఆరోపిం చారు. అలాగే వారి ముగ్గురిపై క్రిమినల్ కేసులు పెట్టాలని దేవాదాయశాఖ సిఫార్సు చేయడంతో అక్టోబరు 16 2024లో పోలీస్ కేసు నమోదు అయిందని గుర్తు చేశారు. కావున వెంటనే బాధ్యతలు అప్పగించాలని ఏస్కే పీడీ నూతన కమిటి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కమిటీలను కలుపుకుని పంగుళూరు సీతమ్మ ఆశయాలకు అనుగుణంగా పారదర్శకంగా ముందుకెళ్ళాలని కోరారు. ఈ సమావేశంలో పంగుళూరు సీతమ్మ, ఆర్యవైశ్య ధర్మ సత్రం గౌరవ అధ్యక్షులు, ఎండోమెంట్ ఆథరైజ్‌డ్ పర్సన్ పసుపర్తి గోపినాథ్, అభివృద్ధి సంఘం ప్రధాన కార్యదర్శి జె. సుబ్బరాజు, ట్రెజరర్ లక్ష్మయ్య, మిట్టలోకేష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బి. విలాస్ గుప్తా

# రైస్ మిల్లులో చోరీ






పుత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త : మునిసిపాలిటీ పరిధిలోని నెత్తం గ్రామంలో వున్న రైస్ మిల్లులో శుక్రవారం ఏడు గంటల ప్రాంతంలో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు మిల్లు తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఎసి మిషన్, ఇన్వెర్టర్ చోరీ చేసేందుకు ప్రయత్నించారు. మిల్లులో వున్న సిసి కెమెరాలు, హార్డ్ డిస్క్‌లను దొంగి లించారు. మిల్లులో అలికిడి విని స్థానికులు గట్టిగా కేకలు వేయగా దుండగులు పరారయ్యారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## స్వార్థంతో తనపై దుష్ప్రచారం

- ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్

**పాలసముద్రం, మార్చి 14 ప్రభాతవార్త:** జిడినెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఐదు మంది తెలుగుదేశం నాయకులు తమ స్వార్థం కోసం తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే ఎంవి థామస్ శుక్రవారం చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సృష్టిస్తున్న స్వర్ణాంధ్రలో తన పాత్ర వుండాలని భావించి, ప్రజలకు సేవ చేయడానికి తాను ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధిం చానన్నారు. ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే పార్టీలోని కొంతమంది అడ్డుకోవడానికి ప్రయత్నించి తాను నకిలీ ఎస్సీనని కోర్టుకెళ్ళారన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి గ్రామంలోకి తాను వెళ్ళి ప్రజల గుండెలను దోచుకుని తక్కువ కాలంలోనే ప్రజాభిమానం సంపాదించడం జరిగిందన్నారు. పార్టీలోని కొంతమంది తాము చెప్పినట్లు వినాలని తనపై ఒత్తిడి తీసుకురావడంతో ప్రజలకు సహాయపడే ఏ కార్యక్రమం అయినా చేస్తానని నాయకుల స్వార్థం కోసం తాను పనులు చేయనని వారికి స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. పార్టీలో సీనియర్ నాయకులు అని చెప్పుకొంటున్న కొంతమంది నియోజకవర్గానికి ఇప్పటి వరకు పార్టీ అధినేత, సిఎం నారా చంద్రబాబు నాయుడును తీసుకురాలేదని, తాను ఎమ్మెల్యే అయిన 9 నెలల్లోనే నియోజకవర్గానికి సిఎం చంద్రబాబునాయుడు వచ్చి ప్రజలకు వరాలు ఇచ్చి వెళ్ళారన్నారు. జిడినెల్లూరులో 2వేల ఎకరాలతో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తామని, పాలసముద్రం మండలంలో గురుకుల బాలుర పాఠశాల ఏర్పాటు చేస్తామని, పెనుమూరులో దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడానికి సిద్ధం అయ్యారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మంది తెలుగుదేశం పార్టీ నేతలు పగతి పూట తెలుగుదేశం, రాత్రి పూట వైకాపా వైపు వుంటూ నియోజకవర్గంను భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. తనతో పాటు తన వ్యక్తిగత సహాయకులపై సైతం ఈ నాయకులు పత్రికల్లో తప్పుడు కథనాలు రాయిస్తున్నా రన్నారు. తనకు నియోజకవర్గంలో ఎవరు ఏమి చేస్తున్నారనే విషయం తెలుసునని, కొంతమంది నాయకులు చిత్తూరు, తిరుపతిల్లో సమావేశాలు నిర్వహించి తనపై వ్యతిరేకత కథనాలు వచ్చేలా చేస్తున్నారన్నారు. జిల్లాలో కుప్పం తరువాత అభివృద్ధి పనులకు ఎక్కువ నిధులు ఖర్చు చేసింది తన నియోజకవర్గానికే అన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న నాయకులు ఎదైనా చెప్పుకోవాలంటే నేరుగా తనను కలిసి చర్చించాలని, అలా కాకుండా ఒక పేపరు పిఎలకు ఇచ్చి వెళితే దాని అర్థమేంటని ప్రశ్నించారు. పోస్టుల భర్తీకి సంబంధించి సెటిల్‌మెంట్లు చేసుకుని తనకు పేర్లు ఇస్తే వారిని నేను ఎలా సిఫార్సు చేయాలని ఆ నాయకులను ప్రశ్నించారు. తన వద్ద దళారులు ఎవ్వరు లేకపోవడంతో ఫలాలు నేరుగా ప్రస్తుతం లబ్దిదారులకు చేరుతున్నాయని, తాను దళారులను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్స హించనని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గం మంచి కోసం తన వద్దకు వచ్చి సలహాలు, సూచనలు ఇస్తే ఆ సలహాలు, సూచనలు మంచిదైతే స్వీకరించి పార్టీలకు అతీతంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## మినీ కుంభమేళాను తలపించిన కదిరిముత్తనపల్లి పెద్దదేవర



**శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త:** శాంతిపురం మండలంలోని కదిరిముత్తన పల్లిలో శ్రీ సిద్ధేశ్వరస్వామి పెద్ద దేవర మినీ కుంభమేళాను తలపిస్తోందని సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె కదిరిముత్తనపల్లిలో జరుగుతున్న కురబ కులస్తుల పెద్దదేవర కార్యక్రమంకు రాష్ట్ర బిసి సంక్షేమశాఖమంత్రి సవితతో కలసి హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. పెద్ద జాతర నిర్వహణకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వం 80లక్షలు ఖర్చు చేసిందన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాలనుంచి ఇంతపెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడం తాను కూడా కదిరిముత్తనపల్లిలో వెలసిన శ్రీ సిద్ధేశ్వరస్వామి, శ్రీబీరేశ్వరస్వామి, శ్రీబత్తేశ్వరస్వామి, శ్రీ రణిసిద్ధేశ్వరస్వామి, శ్రీచెన్నకేశవస్వామి వారిని దర్శించుకోవడంతో తనకు కూడా పుణ్యం దక్కి oదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, గోపీనాథ్, రమేష్, మణి, బసవరాజు, నారాయణ, సత్యేంద్రశేఖర్, కుమార్, నాగరాజు, బాలు, ఉమాపతి, గోపాల్, అనసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకోదండరామస్వామి రథోత్సవం



**శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త :** మండలంలోని రాళ్లబూదుగూరులో వెలసిన శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి రథోత్స వ కార్యక్రమాన్ని ఘన oగా నిర్వహించారు. సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనమ్మ, రాష్ట్ర మంత్రి సవిత రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంకు హాజరై రథం లాగారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొక్కులు కలిగిన భక్తులు రథంపై బొరుగులు, మిరియా లు, చిల్లర నాణేలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, జమీందారు వంశస్తులు, నేతలు విశ్వనాథ నాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్, రమేష్, ఉమాపతి, బాలు, గోపాల్, మణి, కుమార్, బసవరాజు, నారాయణ, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## మండల జనసేన అధ్యక్షుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

**గుడిపాల, మార్చి 14 ప్రభాతవార్త:** మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్‌పై గుడిపాల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయ్యింది. ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించిన వివరాల మేరకు మండలంలోని నారగల్లు పంచాయతీ కొత్తకోట ఆదిఆంధ్రవాడకు చెందిన జగదీష్ భార్య సంధ్య అదే గ్రామంకు చెందిన మరో మహిళ వద్ద కొంత నగదును అప్పుగా తీసుకుంది. ఆ నగదులో సంధ్య సగం చెల్లించి మిగిలిన మొత్తంను కొద్ది రోజుల్లో ఇస్తామని పేర్కొంది. అయితే ఈ నెల 9వ తేదీ సంధ్య తిరిగి చెల్లించాల్సి న మిగిలిన సగం మొత్తం కోసం ఆమె ఇంటి వద్దకు రూప్‌కుమార్ చేరుకుని సంధ్య, ఆమె భర్త జగదీష్‌ను కులం పేరు చెప్పి దూషించి దుర్భాషిలాడినట్లు, నగదును వడ్డీతో పాటు తిరిగి చెల్లించకుంటే చంపుతానని బెదిరించినట్లు బాధిత మహిళ సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామ్మోహన్ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శుభ్రతతోనే ఆరోగ్య సమాజం

**గుడిపాల, మార్చి 14 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం ఆవిష్కరించబడుతుందని రాష్ట్ర తెలుగుదేశం మహిళా ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరీ పేర్కొన్నారు. చీలాపల్లి సిఎంసి ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిసరాల పరిశుభ్రతపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా సిఎంసి ఆసుపత్రి సిబ్బంది వైవి రాజేశ్వరీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిఎంసి సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అరగొండలో ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తవణంపల్లె, మార్చి 14 ప్రభాతవార్త:** జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్స వం వేడుకలు శుక్రవారం రాత్రి మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ అరగొండలో ఘనంగా నిర్వహించారు. అరగొండ జనసేన కమిటి ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండులో జనసేన పార్టీ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే టపాకాయలు పేలుస్తూ సంబరాలు జరుపుకుంటూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జిందాబాద్, జనసేన వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు మోహన్ బాబు, ప్రధాన కార్యదర్శి చిన్న అలియాస్ వెంకటేశ్వర్లు, సోషియల్ మీడియా కోఆర్డినేటర్ అజిత్ శ్రీరాములు, నాయకులు యువరాజ్ స్వేరో, రమేష్ లతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



**కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి ఆలయంలో శుక్రవారం సత్యనారాయ ణవ్ర తంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్స వమూర్తులను ఆలయ మండపంలో వుంచి సత్యనారాయణవ్రతంను నిర్వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణస్వామి వ్రత మహత్యాన్ని అర్చకులు భక్తులకు వివరించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

***ఘనంగా పున్నమి గరుడసేవ*** శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పున్నమి గరుడ సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గరుడవాహనంపై వుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు



**తవణంపల్లె, మార్చి 14 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం మాఘపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలా చార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గోశాలలో పశువుల దాణా చోరీకి యత్నం

**కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త:** గోశాలలో మూగ జీవాలకు అందించాల్సి న పశువుల దాణాను చోరీ చేయడానికి ప్రయత్నించి స్థానికులకు చిక్కిన సంఘటన గురువారం సాయంత్రం కాణిపాకం దేవస్థా నంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. కాణిపాకం గోశాలలో పనిచేసే శానిటేషన్ ఉద్యోగి గోశాలలోని సీసీ కెమెరాలను అప్ చేసి గోమాతలకు అందించేందుకు నిల్వ వుంచిన పశువుల దాణా బస్తాను చోరీ చేసి ఎత్తుకెళుతుండగా స్థానికులు గుర్తించి ఆలయ అధికారులు సమాచారం అందించారు. ఈమేరకు సదరు ఉద్యోగిని వెంటనే విధుల నుండి తొలగించి విచారణ చేసి చర్యలకు ఆలయ అధికారులు ఉపక్రమించారు. ఇదిలా వుండగా గతంలో కూడా ఇదేవిధంగా దాణా బస్తాలు చోరీ చేశారా? అనే కోణంలో అధికారులు విచారణ నిర్వహిస్తున్నారు. దాణా చోరీ చేస్తూ పట్టుబడిన సదరు ఉద్యోగి దళారీ అవతారం ఎత్తి భక్తులకు ప్రత్యేక దర్శనాలు చేయిస్తూ వారి డబ్బులు వసూలు చేస్తున్నట్లు కూడా పలు ఆరోపణలున్నాయి.

## ఎగువ తడకరలో చెరకు తోట దగ్ధం



**తవణంపల్లె, మార్చి 14 ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెరకు తోట దగ్ధమైన సంఘటన మండలంలోని తడకర గ్రామం వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. మండలంలోని ఎగవ తడకరకు చెందిన బేరి ప్రకాష్ అనే రైతు దిగువమాఘం గ్రామానికి చెందిన అమరేంద్రనాయుడు వ్యవసాయ పొలంను లీజుకు తీసుకుని చెరుకు తోట సాగు చేశారు. ఈతోట కోత దశకు వచ్చే సమయంలో పొలంలోని ట్రాన్స్ పార్మర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు అంటుకుని సుమారు 60సెంట్లులో వున్న చెరకు తోట పూర్తిగా దగ్ధమైంది. దీనితో సుమారు రెండు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ప్రకాష్ తెలిపారు. అలాగే పక్కనే వున్న మహేంద్ర అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి వద్ద విద్యుత్ మోటారుకు అమర్చిన విత్యుత్ తీగలు ఈమంటలకు ఆహుతైనట్లు బాధిత రైతు తెలిపారు.

## భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలి



**కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త:** కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల పట్ల ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు మర్యాద పూర్వకంగా మెలగాలని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది, వేదపండితులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడి సమాధానాలు చెప్పాలన్నారు. ముఖ్యంగా ఆలయ ఉద్యోగులు, సిబ్బంది భక్తులను సంభోదించే ముందు సెల్‌ఫోన్లో, సెట్లో మాట్లాడే ముందు గణేశా అని సంభోదించాలని సూచించారు. ఈసమావేశంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనుంజయ, హరిమాధవరెడ్డి, ప్రసాద్, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, అర్చకులు, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర

**చిత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్స వంగా ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం- పరి శుభ్రతను పెంపొందించడానికి స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను అందరి భాగ స్వామ్యంతో కలసికట్టుగా విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై కలెక్టరేట్ నుండి శుక్రవారం కలెక్టర్ అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్రతి మాసం ఒక ఇతి వృత్తంతో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదన్నారు. మార్చి 15న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం- పునర్వి నియోగ వస్తువుల ప్రోత్సా హం ప్రధాన అంశంగా కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. ఈ టెలికాన్ఫ రెన్స్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిల్వ వున్న 5 టన్నుల రేషన్ బియ్యం సీజ్

**చిత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త:** చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మురకంబట్టు సమీపంలోని ఇందిరమ్మకాలనీలోని ఓ ఇంట్లో చితూరు తాలుకా పోలీసు స్టేషన్ పోలీసులు శుక్రవారం అక్రమంగా నిల్వ వుంచిన5టన్నులరేషన్‌బియ్యంనుసీజ్‌చేశారు. ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జెసిబితో ఆలయ పునాది ధ్వంసం

**చిత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త:** చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని మురకంబట్టు సమీపంలో వెంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లోని ఖాళీ స్థలంలో ఆంజనేయ స్వామి గుడి నిర్మాణం కోసం ట్రస్ట్ సభ్యులు వేసిన పునాదిని శుక్రవారం కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. మురకంబట్టు పరిసరాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయం పరిధిలో 90 సెంట్ల ఖాళీ స్థలం వుంది. అయితే ఇరు వర్గాలు ఈ స్థలం తమదంటే తమదేనని పేర్కొంటుండటంతో తాలుకా ఎస్ఐ మల్లికార్జున పునాది ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సీఎం సతీమణికు ఘన స్వాగతం



**పుంగనూరు, మార్చి 14 ప్రభాతవార్త:** బెంగళూరు ఎయిర్ పోర్ట్ లో సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిదేవికు పుంగనూరు దేశం నాయకుడు దొమ్మలపాటి నగేష్ బాబు ఘన స్వాగతం పలికారు. శాంతిపురం జాతరలో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం గన్నవరం నుంచి బయలుదేరి ఆమె బెంగళూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్పోర్టులో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సబిత తో పుంగనూరు దేశం నాయకులు దొమ్మలపాటి నగేష్ బాబు భేటి అయ్యారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సబిత తో నగేష్ బాబు సుమారు గంటపాటు ప్రత్యేకంగా చర్చించారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో మల్బరీ రైజంగానికి పలు రాయితీలు, గిట్టుబాటు ధర కల్పించాలని ఆర్వీటి బాబు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి సబితతో నారా భువనేశ్వరి రోడ్డు మార్గం గుండా శాంతిపురం చేరుకుని జాతరలో అమ్మవారికి వస్త్రాలు సమర్పించారు.

## 16న ఆర్ఎస్ఎస్ కవాతు



**పుంగనూరు రూరల్, మార్చి 14 ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదివారం పుంగనూరులో ఖండ పథ సంచలన నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి త్రిమూర్తి రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలో కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ స్థాపించి శత వసంతంలో అడుగుపెట్టిన తరుణంలో పథ సంచలన చేపట్టనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ట్రావెలర్స్ బంగ్లా నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

## దేవాలయాల్లో కదిరి పౌర్ణమి పూజలు



**చౌడేపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** కదిరి పౌర్ణమి సందర్భంగా బయపల్లి కదిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రాత్రంతా భక్తులు జాగారణ వుండి మొలకలతో స్వామివారిని ఆరాధించారు. మండలంలోని దేవాలయాల్లో మృత్యుంజ యేశ్వ రస్వామి, కమలాంజనేయస్వామి, పుదిపట్ల పంచలింగాలు, వైష్ణవీదేవి, శెట్టిపేట మోక్షగణపతి, ఎర్రపల్లి నందీశ్వరుడు, లద్దిగం నీలంకఠేశ్వరుడు, కరణంవారిపల్లి అభయాంజనేస్వామి, నడుమూరు వీరాంజనేయస్వామి, రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహ స్వామి తదితర ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## నాగిరెడ్డిపల్లి జాతరలో అపశృతి...



**చౌడేపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** జాతరకని వచ్చిన బాలుడు ఇంటి ముందుం దగా విషసర్పం కాటేయడంతో మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు...అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలం వెంగంవారిపల్లికి చెందిన పద్మనాభం, సుధారాణిలు మండలంలోని పెద్దకొండామర్రి పంచాయతీలోని నాగిరెడ్డిపల్లిలో సుధారాణి అమ్మగారింటికి గంగజాతరకు వచ్చారు. వారితో పాటు కుమారుడు అమృత్‌సాగర్(2)ను తీసుకొచ్చారు. జాతరలో అందరూ తలమునకలై వుండగా ఇంటిముందున్న బాలుడిని విషసర్పం కాటేసింది. అపస్మాకర స్థితిలో వున్న బాలున్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరుకు సిఫారస్సు చేశారు. అయితే అక్కడి వెళ్ళే లోపే అమృత్‌సాగర్ మార్గ మధ్యలోనే మృతి చెందాడు. బాలుడి మరణవార్త తెలియగానే నాగిరెడ్డిపల్లి, వెంగంవారిపల్లిల్లో విషాదఛాయలు అలుముకొన్నాయి. లేక లేక పుట్టిన మగ సంతానం విషసర్పానికి బలికావడంతో తల్లిదండ్రల రోధన చూపరులను కంట తడిపెట్టించింది.

## హోళీ మార్వాడీలకు రంగుల కేళి!



**చౌడేపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన హోళీ పండుగను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలోని మార్వాడీలు రంగులు చల్లుకొంటూ సాంప్రదాయ బద్ధంగా హోళీని జరుపు కొన్నారు. రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో హోళికా దహనం గావించారు. శుక్రవారం పట్టణంలో డిజె పాటలతోకుర్రకారుఉర్రూతలూగించారు. మార్వాడీల ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.

## కదిరి నరసింహస్వామి సేవలో గువ్వల



**చౌడేపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:** మండలంలోని బయపల్లి కదిరి నరసింహ స్వామిని తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి దర్శించుకొన్నారు. ఆయనకు గ్రామస్తులు, అభిమానులు సాధరంగా ఆహ్వానం పలికి స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. తేదేపా నాయకులు శ్రీధర్‌రాజు(గిరి), పవన్‌కుమార్, గిరినాయుడు, చిన్ని, అర్జున్‌రాయల్ తదితర నాయ కులు, కార్యకర్తలు స్వామివారిని దర్శించుకొన్నవారిలో వున్నారు.

## ఎమ్మెల్సీ వీర్రాజుకు అభినందనలు తెలిపిన శేషాద్రి



**వెదురుకుప్పం, మార్చి 14ప్రభాతవార్త :** ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సోము వీర్రాజుకు జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి అభినందనలు తెలిపారు. కూటమి భాగస్వామ్యంలో భారతీయ జనతా పార్టీ సముచిత స్థానం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంకు కృషి చేయాలని కోరినట్లు చెప్పారు.

## సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహ స్వామి



**కల్లూరు, మార్చి 14 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మో త్సవాలలో భాగంగా ఏడవ రోజు శుక్రవారం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి గ్రామోత్స వం నిర్వహించారు. ఉభయదారులుగా కరణీకం సంఘం వారు వ్యవహరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న కారు.. యువకుడు దుర్మరణం..



**గంగవరం, మార్చి 14 ప్రభాతవార్త :** కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన శుక్రవారం సాయం త్రం మండలంలో చోటుచేసుకుంది. గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా... మండలంలోని గండ్రాజుపల్లె పంచాయతీ ఆలకుప్పం గ్రామానికి చెందిన రామచంద్ర కుమారుడు నరేష్(28), ఇదే గ్రామానికి చెందిన మారప్ప కుమారుడు విజయ్(24) అనే యువకుడితో కలసి తన ద్విచక్రవాహనంలో పలమనేరు నుండి తమ గ్రామానికి బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై గోవిందశెట్టిపల్లె వద్ద వెళుతుండగా తిరుపతి నుండి బెంగళూరు వైపు వస్తున్న కారు నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా, వేగంగా వచ్చి వెనుక నుండి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా విజయ్ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విజయ్ పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సియమ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



**చంద్రగిరి, మార్చి 14 ప్రభాతవార్త:** శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై శుక్రవారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి స్వామివారి ఉత్స వమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ పండు వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీరంగాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



**పెద్దపంజాణి మార్చి14 ప్రభాతవార్త:** మండలంలోని చీకలదిన్నేపల్లి సమీపంలో ఉన్న ఓ కోళ్ళఫారంలో పనిచేస్తున్న ఓ ఉత్తరాది యువకుడు విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కిరసాయియాదవ్(24) అనే యువకుడు కోగిలేరు పంచాయితీ పరిధిలోని చీకలదిన్నేపల్లి సమీపంలో ఉన్న ఓ కోళ్ళఫారంలో పనిచేసేవాడు ఇతను శుక్రవారం కోళ్ళఫారంలో ఫ్యాన్లు తిరగగక పోవడంతో వాటిని మరమతు లు చేసేందుకుగాను ప్రయత్నించగా అకస్మాత్తుగా విద్యుత్‌షాక్ తగలడంతో అతను విద్యుత్‌షాక్‌కు గురై ఆపస్మారకస్థితిలో కిందకు పడిపోయాడు ఇది గమనించిన కార్మికులు అతన్ని వెంటనే 108వాహనంలో పలమనేరు ప్రభుత్వఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకుపెద్దపంజాణి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అట్టహాసంగా మెడికల్ ల్యాబ్ టెక్నిషన్స్ దినోత్సవం



**తిరుపతి హెల్త్, మార్చి 14 ప్రభాతవార్త :** స్థానిక తిరుపతి నందు తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కచ్చపీ కళాక్షేత్రంలో ల్యాబ్ టెక్నిషన్స్ దినోత్స వ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరిషా విచ్చేసి డాక్టర్ ఎదుగుతు న్నాడంటే ఆ ఆస్పత్రి వెనుక ఉనన ల్యాబ్ టెక్నిషియన్స్ ప్రముఖ పాత్ర పోషిస్తుంటారన్నారు. కరోనా వ్యాప్తి చెందుతున్న తరుణంలో డాక్టర్లు, నర్సులు, పారిశుధ్య కార్మికులతో పాటు ల్యాబ్ టెక్నిషియన్స్ కూడా సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు, సినీ నటులు గౌతమ్ రాజు, రాష్ట్ర అసోసియేషన్ నుంచి నవీన్, శ్రీ హరి బాబు తదితరులతో పాటు తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వినయ్‌కుమార్, ఉపాధ్యక్షులు హరిబాబు, నితిన్ కార్యదర్శి ప్రభు, సభ్యులు హరి నరేంద్ర, అశోక్, ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వైసిపి మండల అధ్యక్షుడుగా కెసిఆర్



**చంద్రగిరి, మార్చి 14 ప్రభాతవార్త:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా మరోమారు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి(కెసిఆర్)ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులిచ్చింది. జెండామోసిన కార్యకర్త స్థాయి నుండి పార్టీ మండల అధ్యక్షుడుగా విశిష్ట సేవలందించిన కెసిఆర్ మరోమారు మండల అధ్యక్షుడుగా నియమితులు కావడం పట్ల క్యాడర్‌లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి సహకరించిన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి, ఆది నుండి తనను నడిపించిన నాయకుడు, మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మోహిత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. ఈ క్రమంలో మోహిత్ రెడ్డి ఆయనకు అభినందనలు తెలియజేసి జగనన్న స్ఫూర్తితో మనమంతా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడుగా నియమితులైన శుభసందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన సన్మానం చేశారు.

## ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో... పరిగ్రాహ్-2కె25 పోస్టర్ ఆవిష్కరణ



కోట, మార్చి 14 ప్రభాతవార్త: కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరిగ్రాహ్ – 2కె25 (జాతీయ స్థాయి శాస్త్ర సాంకేతిక సదస్సు)ను ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి చెప్పారు. ఆ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల్లో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, స్పాట్ ఈవెంట్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇది ఒక చక్కటి వేదిక కాబోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ డి.శ్రీనివాస్, కోకన్వీనర్ డాక్టర్ కె.జగన్మోహన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

**- కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి**



కోట, మార్చి 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతున్నా నేటివరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు లేదా నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జాబ్ క్యాలెండర్ జాడ లేకపోవడంతో జిల్లాలో నిరుద్యోగ యువత పొట్ట చేతబట్టి వలస బాటపడుతున్నారని విమర్శించారు. 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. తల్లికి వందనం, రైతు పెట్టుబడి, ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం పథకాలు బోగస్‌గా విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఒక రాజకీయ నాయకుడు సామాన్య ప్రజల అవసరాలకు కూడా రాజకీయ రంగు పులమడం దారుణమన్నారు. వైసీపీ కార్యకర్తలకు పథకాలు వర్తించకుండా చూడాలని ఒక సీఎంగా చంద్రబాబు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. వైఎస్ జగన్ పాలనలో కులం మతం ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. 2028లో జరగబోయే జమిలి ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన విధంగా గుణపాఠం నేర్పుతారన్నారు.

## హర్యానా గవర్నర్‌ను కలిసిన కోటేశ్వరరావు



కోట, మార్చి 14 ప్రభాతవార్త : శ్రీ భారత్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ ఛైర్మన్ కె.కోటేశ్వరరావు హర్యానా పర్యటన సందర్భంగా శుక్రవారం రాజ్‌భవన్‌కు వెళ్లి హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. హోళీ పండుగ సందర్భంగా రాజ్‌భవన్ సాంప్రదాయం ప్రకారం మొదటిసారిగా వచ్చిన కోటేశ్వరరావుకు శ్రీకృష్ణుని విగ్రహాన్ని బహూకరించి శాలువాతో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఘనంగా సన్మానించారు.

## వాడవాడలా హోళీ సంబరాలు



కోట, మార్చి 14 ప్రభాతవార్త: కోట మండలంలో హోళీ పండుగను పురస్కరించుకొని విద్యానగర్, కోట, చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాలెం, వెంకన్నపాలెం, తిన్నెలపూడి, గూడలి, కేశవరం తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సహజ రంగులు చల్లుకుంటూ ఆట పాటలతో సందడి చేశారు. కోటలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డికి ఆ పార్టీ నాయకులు రమేష్, యువత శుభాకాంక్షలు తెలుపుతూ రంగులు చల్లుకున్నారు.

**నేడు మెగా నేత్ర వైద్యశిబిరం**

కోట మండలం విద్యానగర్‌లోని సాయిబాబా మందిరం వద్ద ఆదివారం ఉదయం ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరం జరుగు తుందని సుశీల నేత్రాలయ నిర్వాహకులు డాక్టర్ పి.సుధాకర్‌రావు చెప్పారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



కోట, మార్చి 14 ప్రభాతవార్త: కోట మండలం చిట్టేడులోని ఎస్సీ గురుకులం, కోట ఎస్సీ గురుకుల పాఠశాలల్లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు ఆలిండియా ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లా దుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి నూరుశాతం ఫలితాలు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఛైర్మన్ చంద్రమౌళి, సుధాకర్, వెంకటరత్నం, పుల్లయ్య, నరసింహులు, ప్రిన్సిపాల్ శుభకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఓబిసి ఛైర్మన్‌గా తడ భాస్కర్



తడ, మార్చి 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాలతో కాంగ్రెస్ ఓబిసి ఛైర్మన్ సొంటి నాగ రాజు తిరుపతి జిల్లా ఓబిసి ఛైర్మన్‌గా తడకు చెందిన పి.భాస్కర్ యాదవ్‌ను నియమించారు. స్థానిక బోడిలింగాలపాడు నివాసి భాస్కర్ విజయవాడ వెళ్లి పార్టీ ముఖ్య నాయకులను కలిశారు. అనంతరం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తిరుపతి జిల్లా పార్టీ కమిటీ అధ్యక్షుడు బాలగురువంబాబు తదితరులు ఈ సందర్భంగా భాస్కర్‌ను అభినందించారు. తడ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శబరిరెడ్డి, మురళీరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అభయ శంకర దేవస్థానంలో పౌర్ణమి పూజలు



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని అభయశంకర దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేశారు. ఈ కార్యక్రమం ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో జరిగింది.

# గూడూరు డివిజన్

## జనావాసాల్లోకి జింక పిల్ల



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతంలోని జనావాసాల్లోకి జింకపిల్ల చేరుకున్న ఉదంతం శుక్రవారం చోటుచేసుకుంది. ముందుగా జింకపిల్ల ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు గాని ఒక ఇంట్లో మరుగుదొడ్డిలోకి చేరుకుంది. అక్కడ ఇంట్లో వారు జింకపిల్లను గుర్తించి హడావుడి చేయడంతో అక్కడ నుంచి గోడలు దూకి రోడ్లపై పరుగులు తీసింది. పక్కనే ఉన్న కోళ్లమిట్ట చెంగాళమ్మ చెట్టు ఆలయం వద్ద వెనుకవైపు వెళ్లిపోయింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న వన్యప్రాణి విభాగం అధికారులు ఈ ప్రాంతానికి చేరుకొని జింకపిల్లను సురక్షితంగా పట్టుకొని తమతో పాటు తీసుకెళ్లారు.

## చైర్ పర్సన్ నక్క భానుప్రియ ఉద్వాసనకు రంగం సిద్ధం

**- జోరుగా కౌన్సిలర్లతో మాజీ చైర్పర్సన్ శారద మంతనాలు**

వెంకటగిరి, మార్చి 14 ప్రభాతవార్త : మున్సిపల్ చైర్ పర్సన్ నక్క భానుప్రియను అవిశ్వాస తీర్మానం పెట్టి దించేందుకు జోరుగా తాగుతున్నాయి. కౌన్సిలర్లను కూడగట్టుకునే ప్రయత్నంలో మాజీ చైర్ పర్సన్ దొంతు శారదచేస్తుంది. 14 మంది కౌన్సిలర్లతో శారద రహస్య సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో 25మంది కౌన్సిలర్లు ఉండగా ముగ్గురు మాత్రం తెలుగుదేశం పార్టీలో చేరారు. 22 మంది వైసీపీకి చెందిన వారే, నక్క భానుప్రియ కూడా వైసిపి పార్టీకి చెందిన వారు. చైర్ పర్సన్ భాను ప్రయాణం గద్దె దించి శారద హాస్పిటలకు వచ్చినందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూరి గుడిసె దగ్ధం

వాకాడు, మార్చి 14 ప్రభాతవార్త: వాకాడు మండల తీరప్రాంత గ్రామమైన పంబలి గ్రామంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం స్థానికులు వివరాల మేరకు గురువారం రాత్రి పంబలి గ్రామానికి చెందిన కడిమిల ఎర్రయ్యకు పూరి గుడిసెకు విద్యుత్ సర్క్యూట్ అయ్యి అకస్మాత్తుగా గుడిసెలో పొగలు వ్యాపించి, విద్యుత్ వైర్ల ద్వారా మంటలు వ్యాపించడంతో అకస్మాత్తుకు జరిగిన సంఘటనకు భయభ్రాంతులైన కుటుంబ సభ్యులు ప్రాణాలను కాపాడుకునేందుకు, ఇంట్లో నుంచి హడావుడిగా వస్తుండగా ఎర్రయ్యకు తల వెనక భాగం తీవ్ర గాయమైనది. ఇంట్లోనే వస్తువులు, ఆహార సామాగ్రి తదితర వస్తువులన్నీ మంటల్లో కాలిపోయాయి. ఎర్రయ్య కుటుంబం వీధిన పడినది. ప్రభుత్వం, దాతలు ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐటీడీఏ అధికారులు తక్షణం స్పందించి ఆ గిరిజన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని పలువురు సూచించారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి!

నాయుడుపేట,మార్చి 14 ప్రభాతవార్త: పెళ్ళకూరు మండలం పెన్నెపల్లి సమీ పంలో జాతీయరహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో ప్రదీఫ్(26)అనే యువ కుడు మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు బెంగుళూరు నుండి మోటార్ సైకిల్‌పై విజయవాడలో స్నేహితుడు వివాహనికి వెళుతుండగా మార్గ మధ్యలో పెళ్ళకూరు మండలం పన్నెపల్లి వద్దకు వచ్చేసరికి ముందుగా ఆగివున్న లారీని ప్రమాదవ శాత్తు మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఢీ కొంది. దీంతో ప్రదీప్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న పెళ్ళకూరు ఎస్సై నాగరాజు తనసిబ్బందితో పంఘటనా స్థలంకు చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహన్ని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెళ్ళకూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోటార్‌బైక్ ఢీకొని వృద్ధుడు మృతి!

కోట, మార్చి 14 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన వెంకయ్య (85) అనే వృద్ధుడు శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళుతుండగా అన్నంబాక గ్రామం వైపు నుంచి మోటార్‌బైక్‌పై వస్తున్న జగదీష్ ఢీకొన్నాడు. ఈ సంఘటనలో వెంకయ్యకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకయ్య మృతిచెందాడు. వెంకయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో బైక్‌తో ఢీకొన్న జగదీష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మనసు ఆనందంగా ఉంది

**-తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుమల,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి: పౌర్ణమివేళ, హోలీ పండుగ రోజు ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.శుక్రవారం ఉదయం ఆయన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందు కున్నారు.

## శ్రీనివాసకల్యాణానికి రండి



తిరుమల,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి రాజధాని వెంకటపాళెంలో శనివారం జరిగే శ్రీనివాస కల్యాణానికి విచ్చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టిటిడి పాలకమండలి ఆహ్వానించింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఉండవల్లిలో సిఎంను కలిసిన టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి బోర్డుసభ్యులు ఆహ్వానపత్రికను అందజేశారు.

## ఏపీ పీపీపీసీఓ రాష్ట్ర కార్యదర్శిగా కోదండం నియామకం

తిరుపతి విద్య, మార్చి 14 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ పోలీస్ పబ్లిక్ ప్రెస్ కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శిగా తిరుపతికి చెందిన సి.కోదండం నియమితులైయ్యారు. ఈ మేరకు పీపీపీసీఓ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.పి అహ్మద్ నుంచి నియామక పత్రం అందినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారని, ఏపీ పీపీపీసీఓ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించడం పట్ల అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.పి అహ్మద్, రీజనల్ ఇన్‌చార్జి ఖాదర్‌వల్లీ, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు జేస్‌బీర్‌కు, జాతీయ, రాష్ట్ర కమిటి నేతలు, ప్రతి నిధుల బృందానికి కోదండం కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి ఇవ్వడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా చెంచుమహాలక్ష్మి పవిత్రోత్సవాలు



తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త : మండలంలోని కళ్ళిపూడి గ్రామంలో వెలసిన చెంచుమహాలక్ష్మి అమ్మవారి 20వ ఆలయ పవిత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన పెరుమాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాలంకరణ జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏడాది ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించే అమ్మవారి పవిత్రోత్సవాలు కార్యక్రమంలో అమ్మవారి పూల అలంకరణకు హైదరాబాదుకు చెందిన ఒభక్తుడు తన వంతు సాయంగా వితరణ అందించారు. ఈనేపధ్యంలో శుక్రవారం అమ్మవారిని దర్శించు కోవడానికి విచ్చేయడంలో సందడిగా నెలకొంది. అమ్మవారిని విశేష సంఖ్యలో మహిళా భక్తులు గంటల తరబడి నిరీక్షించి దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కె.భరత్‌రెడ్డి, ధనశేఖర్, మునిచంద్ర, పలువురు భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు.

## కాణిపాకంలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ

**-దర్శనానికి నాలుగు గంటల సమయం**



కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త: కాణిపాకం వినాయక స్వామి అలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. అయితే శుక్రవారం పౌర్ణమి రోజు కావడం, 10వ తరగతి పరీక్షలు జరుగనుండడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అనూహ్యంగా ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివచ్చారు.అలాగే సాధారణ భక్తులతో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం భారీగా రావడంతో ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. అలాగే ఆలయ పరిసరాలన్ని జనసంద్రంగా మారింది. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు, నాలుగు గంటల సమయం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 150 టిక్కెట్ తీసుకున్న భక్తులు మాడా వీధుల్లో స్వామి దర్శనం కోసం ఎండలో సైతం భారులు తీరి నిలబడ్డారు. రద్దీ దృష్ట్యా ఆలయ క్యూలైన్లులో బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేపట్టారు.

## అక్రమార్జన కోసం 'దేశం'లోని ఓ వర్గం... నాపై తప్పుడు ప్రచారం!

**-ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్**



చిత్తూరు, మార్చి 13 ప్రభాతవార్త: ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ చెన్నై కేంద్రంగా దేశ, విదేశాల్లో సంతాన సాఫల్య కేంద్రాలు నిర్వహిస్తూ నిత్యం బిజీగా వుంటారని, ఆయనను డమ్మీ చేసి నియోజకవర్గంలో చక్రం తిప్పాలని కలలు కన్న కొంతమంది తెలుగుదేశం నాయకులకు ఇప్పుడు చుక్కలు కన్పిస్తున్నాయి. సిఎం చంద్రబాబు నాయుడు జిల్లాలోని ఏ ఎమ్మెల్యేకు మంత్రి వర్గంలో స్థానం కల్పించక పోవడం, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్‌కు మాత్రం ప్రభుత్వ విప్ పదవి కట్టబెట్టి మరింత ప్రాధాన్యత ఇవ్వడంపై పార్టీలోని ఓ వర్గ నేతలకు దిమ్మ తిరుగుతోంది. 2008 నియోజకవర్గాల పునర్వి భజనతో అప్పటి వరకు వేపంజేరి నియోజకవర్గంలో మెజార్టీ మండలా లతో కలిపి కొత్తగా గంగాధర నెల్లూరు ఎస్సీ నియోజకవర్గంను ఏర్పాటు చేశారు. 2009లో ఈ నియోజకవర్గానికి మొదటి సారి అసెంబ్లీ ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి డాక్టర్ గుమ్మడి కుతూహలమ్మ పోటీ చేసి విజయం సాధిస్తే తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ పరాజయం చవిచూశారు. 2014 ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా ఇక్కడి నుండి మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి పోటీ చేసి విజయం సాధించగా తెలుగుదేశం నుండి మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికల్లో ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా మరోసారి మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి పోటీ చేసి విజయం సాధించగా తెలుగుదేశం నుండి మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ పోటీ చేసి ఓడిపోయారు. ఈ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైకాపా అధికారంలోకి రావడంతో నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా హరికృష్ణను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ క్రమంలో పార్టీలోని ఓ వర్గం నేతలు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా వున్న హరికృష్ణకు సహకారం అందించకుండా పార్టీలో సర్వం తానై వ్యవహరిస్తుండటంతో కినుక వహించిన హరికృష్ణ పార్టీకి రాజీనామా చేసి తెరమరుగు అయ్యారు. ఎన్నికలకు మరో రెండేళ్ళకు పైగా వ్యవధి వుండటంతో పార్టీ అధిష్టానం జిడినెల్లూరు ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఇక్కడ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా తెలుగుదేశం పార్టీ తమ పార్టీ అని భావించే సామాజిక వర్గానికి చెందిన ఓ నాయకుడిని నియమించింది. ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఎవరిని ఖరారు చేసినా నియోజకవర్గంలో తన పెత్తనం వుంటుందని భావించిన ఆ నేత పార్టీ పటిష్టం చేయడం పేరిట ఒక సామాజిక వర్గం వారి నుండి భారీగా వసూళ్ళకు పాల్పడినట్లు ఆరోపణలు వున్నాయి. 2024 ఎన్నికల్లో ఇక్కడి నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చెన్నైలో డాక్టర్‌గా స్థిరపడిన డాక్టర్ విఎం థామస్ అయితే సరిపోతుందని, ఆయన అభ్యర్థి అయితే ఆయన ఆసుపత్రులు చెన్నైలో వుండటంతో ఎక్కువ సమయం అక్కడ గడుపుతారని, నియోజకవర్గంలో పెత్తనం మొత్తం తనదే అవుతుందని ఆ నేత భావించారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం అనుకున్నట్లుగానే తెలుగుదేశం పార్టీ అధికారం చేజిక్కించుకోవడం, జిడినెల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ విఎం థామస్ 26,011 ఓట్ల మెజార్టీ సాధించారు. జిడినెల్లూరు నియోజకవర్గం ఏర్పడి మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఓటమి పాలైన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఈ సారి గత వైకాపా ప్రభుత్వంపై ప్రజల్లో వున్న వ్యతిరేకతతో డాక్టర్ విఎం థామస్ ఎమ్మెల్యేగా భారీ విజయం సాధించారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే విఎం థామస్ చెన్నైలోని ఆసుపత్రి వ్యవహారాలను ప్రక్కనపెట్టి ప్రజా సేవకు సిద్ధం అయ్యారు. నియోజకవర్గంపై ఎమ్మెల్యే పూర్తి దృష్టి సారించడంతో గతంలో పాలసముద్రం, పెనుమూరు మండలాల్లోని ఇద్దరు నాయకులు నియోజకవర్గంలో పార్టీని ఎలా భ్రష్టు పట్టించారనే వ్యవహారాలు ఒకొక్కటి వెలుగు చూశాయి. పార్టీని పటిష్టం చేయడం అనే సాకుతో అప్పటి నియోజకవర్గ సమన్వయకర్త బెంగళూరులో ఐటి ఉద్యోగులు, పెద్ద వ్యాపారవేత్తలతో సమావేశాలు నిర్వహించి 4 నుండి 5 కోట్ల రూపాయల వరకు వసూలు చేశారని తెలిసింది. అలాగే పేదల కోసం నిర్వహించే అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతల నుండి 2.5 కోట్ల రూపాయలు వసూలు చేశారని తెలిసింది. అలాగే ప్రత్యర్థి పార్టీల్లోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కె రోజాలతో ఈ నేత సన్నిహిత సంబంధాలు నిర్వర్తించా ఆయా నియోజకవర్గాల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసినట్లు ఆరోపణలు వున్నాయి. ఈ నేత ప్రత్యర్థి పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్‌కె రోజాను తన రిసార్ట్‌కు ఆహ్వానించి మూడు సార్లు ఆతిధ్యం ఇచ్చి, తన రిసార్ట్ లైసెన్స్ సీజ్ కావడంతో కోట్ల రూపాయల జరిమానా చెల్లించాల్సి రావడంతో అప్పటి డిప్యూటీ సిఎం, ఎక్సైజ్ మంత్రి నారాయణస్వామితో చర్చించి 92 లక్షల రూపాయలు ఇచ్చి మళ్ళీ రిసార్ట్‌ను పునఃప్రారంభించారనే వ్యవహారం వెలుగు చూస్తోంది. అలాగే నియోజకవర్గ పరిధిలో మైనింగ్ అధికంగా వుండటం సరిహద్దు రాష్ట్రం తమిళనాడుకు ఇక్కడి నుండి గ్రానైట్ రాళ్ళను అక్రమంగా తరలించడానికి క్వారీ యాజమానుల నుండి ఈ నేత కోట్ల రూపాయలు వసూలు చేశారని తెలిసింది. ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు మంజూరు చేయడానికి ఈ నేత వారి నుండి 20 శాతం కమీషన్లు పుచ్చుకున్నారని కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి వెళ్ళడం, లబ్దిదారుల నుండి తీసుకున్న కమీషన్ ఎమ్మెల్యేకు ఇస్తున్నామని ప్రచారం చేయడంతో ఈ వ్యవహారం సీరియస్ అయినట్లు తెలిసింది. ఒక్క పాలసముద్రం మండలంకు రూ.5 కోట్ల పనులు మంజూరైతే పార్టీ కోసం కష్టపడిన వారికి పనులు ఇవ్వకుండా చేయడం, మద్యం బెల్టుషాపులు ఏర్పాటు చేసుకోవడానికి ఒకొక్కరి నుండి రూ.15 వేలు వసూలు చేసినట్లు కొంతమంది నాయకులు, కార్యకర్తలు నేరుగా ఎమ్మెల్యే డాక్టర్ ఎంవి థామస్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తమిళనాడు రాష్ట్రం సరిహద్దుగా వుండటంతో ఆ రాష్ట్రానికి చెందిన కొంతమంది వ్యక్తులకు నియోజకవర్గ పరిధిలో సుమారు 200 ఎకరాల డికెటి భూములను బినామీ పేర్లు పెట్టి ఈ నేత చేజిక్కించుకున్నట్లు తెలిసింది. అలాగే పెనుమూరు మండలానికి చెందిన ఓ పార్టీ నేత సైతం గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి డిప్యూటీ సిఎంను మచ్చిక చేసుకుని కోట్లాది రూపాయలు ఆర్జించారని ఆరోపణలు వున్నాయి. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నాయకులపై వస్తున్న ఫిర్యాదులను ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ ఎప్పటి కప్పుడు పార్టీ అధినేత, సిఎం నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్త న్నారు. మార్చి 2న పెన్షన్ల పంపిణీకి జిడినెల్లూరు వచ్చిన సిఎం చంద్రబాబు నాయుడు పార్టీ నేతలతో సమావేశంలో వైకాపా నాయకులు, కార్యకర్తలకు ఒక్క పని చేయవద్దని చెప్పడం ఈ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలను ఉద్దేశించి పేర్కొన్నప్పటికీ ఆ మాటలు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. నియోజక వర్గంను తమ చెప్పచేతుల్లో వుంచుకోవడానికి ఓ వర్గం నాయకులు చేస్తున్న ప్రయత్నాలను ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ సిఎం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఆ వర్గం నేతలు మాత్రం ఏ మాత్రం తగ్గని పరిస్థితుల్లో ముందుకు వెళ్తున్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త: మండలంలని తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి గ్రామంలో వెలసిన చెంచుమహాలక్ష్మి అమ్మవారి పవిత్రోత్సవాల్లో భాగంగా రూప మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ కోగిల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఉమ్మడి జల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసు దేవనాయుడు, మండల ఎంపిపి నిర్మలవాసుదేవనాయుడులు ప్రారంభించారు. ఉచిత వైద్యశిబిరంలో సుమారు 3వేల మందికిపైగా ఉచిత వైద్యసేవలు అందించి అసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీచేశారు. కార్యక్రమంలో డాక్టర్ లావణ్య కుమార్‌రెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ రాధా, డాక్టర్ కృష్ణకుమార్, సర్పంచ్ కోగిల నాగేంద్ర, ఆలయ కమిటీ సభ్యులు పెరుమాల్‌రెడ్డి, గోపిరెడ్డి, ముని రాజారెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత అన్న ప్రసాదం వితరణ



తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త : తాటిపర్తి పంచాయతీలోని కళ్ళిపూడి గ్రామంలో వెలసిన చెంచుమహాలక్ష్మి అమ్మవారి పవిత్రోత్సవాల్లో భాగంగా సుమారు ఐదువేల మందికి నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పెరుమాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనేపధ్యంలో మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. 11గంటల నుంచి ప్రాంభమైన అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 4గంటల వరకు సాగింది. సుమారు ఐదు వేలమందికి పైగా అన్నదానాన్ని నిర్వహించారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎపి ఎన్జీవో అధ్యక్షులు



తొట్టంబేడు, మార్చి 14 ప్రభాతవార్త : మండలంలోని తాటిపర్తి పంచాయతీ కళ్ళిపూడి గ్రామంలో చెంచుమహాలక్ష్మి అమ్మవారి పవిత్రోత్సవాలల్లో భాగంగా అమ్మవారిని ఎపి ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షులు మరియు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సి.చెంచురత్నం యాదవ్ దంపతులు విచ్చేసి దర్శించుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షులు భాస్కర్ తదితరులు ఉద్యోగ సిబ్బంది విచ్చేసి దర్శించుకున్నారు.ఆలయంలో వెలసిన అమ్మవారిని దర్శించుకుని ప్రతి ఏడాది తన వంతు సాయంగా ఉత్సవాలకు రూ.10,116లు సమర్పించారు. కార్యక్రమంలో చెంచురత్నంయాదవ్ దంపతులతో పాటు పలువురు ఏపి ఎన్జీవో సిబ్బంది పాల్గొన్నారు.

## రంగుల హరివిల్లు ప్రతి ఒక్కరి జీవితం



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 14 ప్రభాతవార్త : రంగుల హరివిల్లు ప్రతి ఒక్కరి జీవితం అని టుటౌన్ సిఐ వెంకటేశులు, తొట్టంబేడు సిఐ తిమ్మయ్యలు వివరించారు. శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలో సందడి నెలకొంది. మండల కేంద్రానికి సమీపంలోని టిఎంవి కండ్రిగ వద్ద ఉన్న బాబా రాందేవ్ ఆలయంలో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. మార్వాడి మహిళా కళాశాల విద్యార్థినులు అంతా కలసి రంగుల పండుగను ఆహ్లాదంగా జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులు పూసు కుంటూ సందడిచేశారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రంగులు పూసుకుని ఎంతో ఆనందంగా పండుగ జరుపుకుంటారు. పాటలు, రెయిన్ డ్యాన్స్‌లతో ఎంజాయ్ చేస్తారు. యువతరం ఈ పండగను స్నేహితులు, కుటుంబ సభ్యులతో రంగుల హరివిల్లుల్లో ఆటలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.